క్లుప్తంగా

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వత్సవాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు చెంబేటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్న సమవేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భాను హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు.

వైభవంగా ముత్యాలమ్మ ప్రతిష్ట



కొణకంచి(పెనుగంచిప్రోలు): గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ, పోతురాజులు, నాగేంద్రస్వామి ప్రతిష్టామహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతిపూజ, పుణ్యావాహచనం, భీజన్యాసం తదితర పూజలను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ఈ ఉత్సవంలో జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్, టీవీ సీరియల్ నటుడు ధనియాల రాధాకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ట అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు,

డంపింగ్‌యార్డు పరిశీలన



పెనుగంచిప్రోలు: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న డంపింగ్ యార్డును డీఆర్‌డీఏ ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్ డైరెక్టర్ లావణ్య సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులు గురించి తెలుసుకున్నారు. తడి, పొడిచెత్త సేకరణ వాటిని వేరుచేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, ఏపీఎం రాజారావు, ఏపీఓ తిరుపతయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ పాల్గొన్నారు

ఘనంగా ఎదురు కోలోత్సవం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని నరసింహ స్వామి కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామికి చూర్ణోత్సవం, చక్రతీర్థం, వసంతోత్సవంతో పాటు ఎదురు కోలోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. లక్ష్మీ నరసింహ స్వామి బృందావనం భక్తులు జానపద నృత్యాలు, కూచిపూడి ప్రదర్శనలతో పాటు నరసింహ స్వామి పౌరాణిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈఓ నాగరాజు పాల్గొన్నారు.

లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం



నందిగామ: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆరు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారికి పుట్టింటి నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పసుపు కుంకుమలతో సామూహిక పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవం నిర్వహించారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు బానుడు భగభగలాడాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

కంచికచర్లలో..

కంచికచర్ల: మండలంలో శుక్రవారం మధ్యాహ్న గంట పాటు భారీగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిత వర్షం కురవటంతో ప్రజలు భయాంధోళనకు గురయ్యారు. మండలంలోని గండేపల్లిలో వేమవరపు పుల్లయ్య ఇంటి సమీపంలో ఓ పిడుగు పడింది. ఆ సమయంలో ఆరుబయట ప్రజలు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

సంక్షేమ పాలనతో ప్రజలందరికీ నమ్మకం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చట్టన్నవరం(వీరులపాడు): గతంలో ఓట్ల కోసం మాత్రమే ప్రజల ముందుకు వచ్చే ప్రజా ప్రతినిధులు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమం తెలుసుకునేందుకు ప్రజల వద్దకు వస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని చట్టన్నవరం గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. అబివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి మనసున్న ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వానికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ చలమాల దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ కోట రామారావు, పార్టీ మండల రైతు విభాగం కన్వీనర్ మట్టూరి సాయిబాబు పాల్గొన్నారు.



చట్టన్నవరంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగనన్న విదేశీ విద్యా దీవెనతో బంగారుబాట

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం పేద పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసి, వారికి భరోసా కల్పిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. పేట నియోజకవర్గంలోని వత్సవాయి గ్రామానికి చెందిన నూర్‌బాషా జాన్‌సైదులు కుమార్తె సానియాకు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద కజకిస్థాన్ దేశంలో ఎంబీబీఎస్ చదివేందుకు సీటు లభించింది. దీనికి సంబంధించి వీసా, ఫీజు తదితర ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను గృహంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్‌ను సానియా, ఆమె కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రంలో మునుపెన్నడూ లేని విధంగా పేద విద్యార్థులు విదేశీ ఉన్నత విద్య కోసం అద్భుతమైన పథకాన్ని అమలుచేశారని తెలిపారు. ఈ రోజు సానియాకు కజకిస్థాన్ దేశంలో ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం రావడం సంతోషదాయకమన్నారు. వైఎస్సార్ సీపీ వత్సవాయి మండల అధ్యక్షుడు గాదెల రామారావు, తిరుపతమ్మ దేవస్థాన డైరెక్టర్ మురుమూరి రమాకాంత్, రాజు పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ సీటు పొందిన సానియాను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని స్వయం సహాయక డ్వాక్రా సంఘాలు(మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 30 మంది డ్వాక్రా సభ్యులు కలసి బట్టలు, పిండివంటలు, ఫ్యాన్సీ వస్తువులు, పచ్చళ్లు, బుట్టలు తదితర 20 రకాల ఉత్పత్తులను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ అర్బన్ మార్కెట్లను ఏర్పాటుచేసి స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే ఉద్దేశ్యంతో జీవనోపాధుల కల్పనలో భాగంగా ప్రతి మూడు నెలలకోసారి అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి మెప్మా సంస్థ ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు మెప్మా సీఎంఎం సుజాత తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

భూముల రీ సర్వేతోనే కచ్చితమైన హద్దులు

కంచికచర్ల: భూముల రీ సర్వే చేయడంతో కచ్చితమైన కొలతలు, హద్దులు వస్తాయని తహసీల్దార్ పీ శంకరరాబు అన్నారు. మండలంలోని పేరకలపాడు సచివాలయంలో శుక్రవారం రైతులకు జగనన్న భూ హక్కు, భూ రక్షపై భూముల రీ సర్వేపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం నాటి భూముల కొలతలు, హద్దులలో తేడాలుండటంతో అనేకమంది రైతులు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం జగనన్న భూ రక్ష-భూ హక్కు పథకం ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎటువంటి తేడాలు లేకుండా కొలతలు, హద్దులు వస్తాయన్నారు. రెవెన్యూ సిబ్బంది భూములను రీ సర్వే చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా సహకరించాలన్నారు. సర్వే చేసే సమయంలో భూములకు సంబంధించిన రికార్డులను తీసుకెళ్లి సిబ్బందికి అందించి సహకారం చేయాలన్నారు. సమావేశంలో నందిగామ డివిజనల్ సర్వే అధికారి ఎస్.రావీంద్ర ప్రసాద్, ఎంపీడీఓ కే బాలశంకరరావు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, మండల సర్వేయర్ బసవరావు పాల్గొన్నారు.



భూ సర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వత్సవాయి: వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉద్యానవనశాఖాధికారి వరినీకుమారి తెలిపారు. మండలంలోని భీమవరం, మక్కపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలంలో ముచ్చింతాల, జగ్గయ్యపేట మండలంలో వేదాద్రి గ్రామాలలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మరో నాలుగు రోజులపాటు వర్షాలు ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కల్లాల్లో మిర్చి ఉన్న వారు మిర్చి కుప్పగా చేసుకుని పట్టాలు కప్పుకోవాలన్నారు. బస్తాలలో తొక్కడానికి సిద్ధంగా ఉన్న మిర్చిని సురక్షితమైన ప్రాంతానికి తరలించుకోవాలని చెప్పారు. వేదాద్రిలో రెండున్నర ఎకరాలలో అరటి పంట నష్టపోయినట్లు తెలిపారు.



కల్లంలో ఉన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న వర్ధినీకుమారి

శ్రావ్యంగా వెంగమాంబ సంకీర్తనలు

విజయవాడ కల్చరల్:లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని శ్రవణ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సంకీర్తనా కార్యక్రమం మధురంగా సాగింది. భక్తులు వెంగమాంబ జయంతి ఘనంగా నిర్వహించారు. వెంగమాంగ రచించిన సంకీర్తనలను మాన్య మ్యూజిక్ అకాడమీ బృందం, గండదూరి శ్రీనివాస మూర్తి బృందం, ఎస్.జ్యోతి, జి.హంసిని, పి.పద్మసౌమ్య, మోదుమూడి అంజనా సుధాకర్ బృందం గానం చేశారు. తెలిపితే మోక్షము. జయ జయ నృసింహ, సముఖ ఎచ్చరిక తదితర కీర్తనలు ఆలపించారు. సుబ్రహ్మణ్య రాజు సీహెచ్ సూర్యా వాద్య సహకారం అందించారు. శనివారం నుంచి వారం రోజులపాటు అన్నమయ్య 615 జయంతి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు ప్రసాద్, సత్యబాలు తెలిపారు. ఉదయం 7 గంటలకు పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపం నుంచి అన్నమయ్య విగ్రహం ఊరేగింపు నగర సంకీర్తన జరుగుతుందన్నారు. సంగీత విద్వాంసులు 12 గంటలపాటు అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తారు.



కీర్తనలు గానం చేస్తున్న హంసిని, పద్మ సౌమ్య

10 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు):వేసవి సెలవుల్లో విద్యార్థినులు, మహిళలకు శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న శిక్షణలో భాగంగా బ్యూటీషియన్ కోర్సు, మెహిందీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, టై అండ్ డై, పాట్ పెయింటింగ్, క్యాన్వాస్ పెయింటింగ్, 3డి పెయింటింగ్, ఐషన్ ఆర్ట్, మౌల్డ్ ఇట్ వర్క్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9160991218, 9703839116 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చాట్ జీపీటీపై అవగాహన

మైలవరం: ప్రపంచం టెక్నాలజీలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛాట్ జీపీటీపై ఒక రోజు వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ ఛాట్ జీపీటీ అన్ని రంగాల్లో విస్తరిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటుందన్నారు. టెక్ గురు ప్రతినిధి డి.సాయి సతీష్ మాట్లాడుతూ మనిషి మేధస్సు కుమించేలా అసలు మనిషికి మేధస్సే అవసరం లేకుండా కూడా చేసేలా ఉందన్నారు.

గంజాయి ముఠాపై కేసు నమోదు

జి.కొండూరు: బైకుపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులపై జి.కొండూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ ధర్మరాజు తెలిపిన వివరాల ప్రకారం..జి.కొండూరుకు చెందిన ఒరుగు నవీన్‌కుమార్, మైలవరానికి చెందిన గరికపాటి శ్రీహర్ష, విజయవాడకు చెందిన చేగిరెడ్డి లోకేష్‌రెడ్డి అనే ఈ ముగ్గురు యువకులు గురువారం మధ్యాహ్నం సమయంలో బైకుపై గంజాయిని తీసుకొని మైలవరం వైపు వెళ్తున్నారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్ఐ ధర్మరాజు సిబ్బందితో బైకును వెంబడించి జి.కొండూరు మండల పరిధి చెవుటూరు శ్రీవాణి ఇంజినీరింగ్ కళాశాల బస్‌స్టాప్ వద్ద గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ రోహిణీదేవి సమక్షంలో నిందితుల నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మరాజు చెప్పారు. ముగ్గురు నిందితులను శుక్రవారం జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఆస్తుల వేలంపై నిరసన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్ ఆస్తుల వేలం నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. పూర్వం నుంచి ప్రజలకు సేవలు అందించిన ప్రభుత్వ సంస్థల ఆస్తులు ప్రధాని మోదీ తన మిత్రులకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నారని ఆరోపించారు. కొండపల్లిలో టెలిఫోన్ ఎక్స్చేంజ్ స్థలాలు వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు వినియోగించాలన్నారు. వేలం నిర్ణయం ఉపసంహరించా లని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలుడి ఆచూకీ లభ్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): తండ్రి మందలించాడనే కారణంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన 13 ఏళ్ల బాలుడి ఆచూకీ ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం కనుకొన్నారు. గుంటుపల్లి ఖాజీపేటకు చెందిన సాలి విజయకుమార్ తన కుమారుడైన సాలి అభిలాష్‌ను సక్రమంగా చదవడం లేదని మందలించాడు. తండ్రి మందలింపుతో అలిగిన అభిలాష్ ఈనెల 3న ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయాడు. తండ్రి పిర్యాదు మేరకు సీఐ పి.శ్రీను పర్యవేక్షణలో పోలీస్ బృందాలు గాలించి బాలుడి ఆచూకి కొనుగొన్నారు. స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బాలిక మిస్సింగ్ కేసులో సత్యనారాయణపురం పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే మైనర్ ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్యనారాయణపురం, ముత్యాలంపాడుకు చెందిన బాలిక (16) నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల విడుదలైన పరిక్ష ఫలితాల్లో బాలిక ఫెయిల్ అయింది. దీంతో సప్లమెంటరీ పరీక్షలకు ఫీజు కట్టి చదివిన కళాశాలలోనే ట్యూషన్‌లో చేరింది. గురువారం ఉదయం 8 గంటలకు ట్యూషన్‌కు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వెంకట నారాయణ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లలో సీసీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టాగా బాలిక నగరంలోనే ఉండే తన స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్లుగా గుర్తించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే బాలిక ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడంపై నగర సీపీ టీకే రాణా సిబ్బందిని అభినందించారు.

నయనానందకరంగా నరసింహుని కల్యాణం



లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



స్వామికి ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న విప్ ఉదయభాను దంపతులు

వేదాద్రి(జగ్గయ్యపేట): యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం రెండు కళ్లు చాలనంత నయనానందకరంగా అర్చకులు నిర్వహించారు. గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి తిరుక్కల్యాణ మహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామి కలాయణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పరాంకుశం వాసుదేవాచార్యులు, వేదాంతం శేషాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృష్ణానది ఒడ్డున ఆలయం ఉండడంతో పండు వెన్నెల్లో భక్తుల హర్ష ధ్వానాల మధ్య మూడు గంటల పాటు స్వామి కల్యాణం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులు పాల్గొని ముత్యాల తలంబ్రాలు సమరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి ఇందిరాదత్ ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలు సమర్పించారు. గతేడాది కంటే ఈ ఏడాది ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచి కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ జానకిరామ్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగరాజు, సర్పంచ్ గుడారు పేరయ్య, కెసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సీఎం కృషి

వెల్లంకి(వీరులపాడు): రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వెల్లంకిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం, గోడౌన్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని రైతుల సౌకర్యార్థం రూ.24 లక్షలతో పీఏసీఎస్ భవనం, గోడౌన్‌లను నిర్మించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పూర్తి నిరాధరణకు గురైన వ్యవసాయ రంగం, రైతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాలుగా అండగా ఉంటూ సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తారెడ్డి, షేక్ కార్పరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ హుసేన్‌బీ పాల్గొన్నారు.



సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఘనంగా ప్రతిష్టా మహోత్సవాలు

దాచవరం(వీరులపాడు): మండలంలోని దాచవరంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శివకామేశ్వరీ రామాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తదితరులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామిశెట్టి రత్న ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట హరిష్, గద్దె వెంకటేశ్వర్లు, ఎంపీపీ కోటేరు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

వెల్లంకిలో..

మండలంలోని వెల్లంకి గ్రామంలో పార్వతీ దేవి, ముత్యాలమ్మ, గంటాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలతో పాటు నాభిశిల, విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ హుసేన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరీ, సొసైటీ చైర్మన్ తల్లపురెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లతో సమీక్ష

జగ్గయ్యపేట అర్బన్: టిడ్కో గృహాల లబ్ధిదారులకు రుణాల మంజూరు, చిరు వ్యాపారులకు జగనన్న తోడు, పీఎం స్వానిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం తదితర అంశాలకు సంబంధించి వివిధ బ్యాంకర్లతో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ తక్కువ మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారిలో 400 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్లు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి

కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 10వ తేదీ లోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సంఘ సీనియర్ నాయకుడు బీ మల్లికార్జునరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు మొబైల్ నంబర్‌కు ఆధార్‌లింక్ చేయించుకోవాలన్నారు. కొంత మంది పెన్షనర్లు జీవన ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానా కార్యాలయానికి సమర్పించలేదని, ఇప్పటికైనా ఎస్‌టీఓకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. ఈ ఏడాది జూన్‌లో ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేయాలని సూచించారు. సమావేశంలో సంఘ కోశాధికారి నాగేశ్వరరావు, పెద్దిసీడి కోటేశ్వరరావు, బీ కృష్ణమూర్తి బీవీ సర్వేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, జానిమియా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోతరాజు

గౌతమబుద్ధుని జయంతి వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ధనంబోడుపై ఉన్న బౌద్ధస్థూపం వద్ద బుద్ధజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బౌద్ధ ఉపాసక అమృత నాగభూషణం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తదితరులు బౌద్ధస్థూపం వద్ద బుద్ధ వందనం చేశారు. అనంతరం జరిగిన సభలో చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో నవ్యాంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా ఉన్న పేట ప్రాంతాన్ని గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అందుకు ఆయన ఇప్పటికే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారన్నారు. త్వరలో ఆమోదం పొంది క్రియారూపం దాల్చనున్నట్లు తెలిపారు. అలాగే పేట ప్రాంతాన్ని బౌద్ధక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు పురపాలకసంఘం తరఫున తనవంతు సహకారం అందజేయనున్నట్లు తెలిపారు. జరసం అధ్యక్షుడు, రిటైర్డ్ అధ్యాపకులు ఎస్‌కె. అబ్బాస్ ఆలీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఇంకా మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, ఆధ్యాత్మిక వేత్త యలదండి శ్రీనివాసరావు తదితరులు బుద్ధుని చరిత్ర తదితర అంశాలపై ప్రసంగించారు. ముందుగా ఉపాసక నాగభూషణం బుద్ధుని పంచశీలను పలువురిచేత నేర్పించారు. అనంతరం ఈ ప్రాంత ఉపాసక నాగభూషణాన్ని పలువురు సత్కరించారు.



బుద్ధ వందనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్

న్యాయ వాదులనిరసన

నందిగామ: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కడపలో న్యాయవాదులపై పోలీసులు చేసిన దాడికి నిరసనగా నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.